# షరా మామూళ్ళే

-డా॥ యన్.వి.రామరాజు

ఆరోజు సెలవు కావడంతో ఇంట్లోనే వుండిపోయాను. ఆ మరుసటి రోజే పండగ. బ్రేక్‌ఫాస్టు, పేపరు పఠనమైన తర్వాత ఏం చెయ్యాలో తోచలేదు. పిల్లలు వారి ఫ్రెండ్స్‌ని కలవడానికి బయటికెళ్లిపోయారు. టీవీలో పండగ పేర్న పండక్కి సంబంధం లేని ఏవేవో ప్రోగ్రామ్స్ వస్తున్నాయి. నాకు నచ్చిన ప్రోగ్రామ్‌లేవీ రావడంలేదు. ఛానెల్స్ మార్చి మార్చి పది నిముషాలకే బోరుకొట్టింది.

బయటపడి అలా.. ఊరిలో తిరిగితే కొంచెం టైం పాసవుతుందనుకుంటూ... బయలుదేరబోతుండగా- మనసులో మాట కనిపెట్టిన మునీశ్వరిలా.. "ఇంట్లో సరకులు నిండుకున్నాయండీ.. అందులోనూ రేపు పండగాయె.. ఎటూ బయటికెళ్తున్నారుగా"- అంటూ ఒక చేతిలో బిగ్ షాపర్, ఇంకో చేతిలో ప్రొవిజన్స్ లిస్టు ఉంచింది శ్రీమతి.

నేల ఈనిననట్టు ఎక్కడ చూసినా జనమే! స్కూటర్లు, మోటర్ సైకిళ్ళు ఆటోలు కార్లతో రోడ్లన్నీ చాలా రద్దీగా ఉన్నాయి. మెయిన్ రోడ్డు మీద ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఒక గవర్నమెంటు జీపు రోడ్డుకడ్డంగా ఆపి వుంది. ఒక ప్రక్క టూ వీలర్స్ మరోపక్క ఆటోలు, కార్లు ఆగి వున్నాయి. ఖాకీ యూనిఫాంలో వున్న కొందరు వెహికిల్స్ పేపర్స్ చెక్ చేస్తున్నారు. ఎవరైనా రూల్స్ మాట్లాడితే ఫైన్‌కట్టమంటున్నారు. లౌక్యం తెలిసిన కొందరు పదో పరకో సమర్పించుకుని తప్పించుకుం టున్నారు.

గత అనుభవమున్న నాకు ఈ బహిరంగ వసూళ్ళ భాగోతం చూసి బల్స్ వెలిగింది. స్కూటర్ గేరు మార్చి పక్క వీధిలోకి ఉరికించాను. పండగలపుడే వీరికి రూల్స్ ఎందుకు గుర్తొస్తాయో నాకిప్పటికి అర్థంకాదు!

నా స్కూటర్ సూపర్ మార్కెట్టు ముందాగింది. జనంతో షాపు రద్దీగా వుంది. మా ఏరియాలో పెద్ద షాపు అదే! కిషన్‌సేఠ్ చేతిలో పలకతో బయటికొస్తూ నన్ను చూసి 'సాబ్‌కి స్టూలు వెయ్యరా'- అంటూ కుర్రాడికి చెప్పి పలకను బయట గోడకున్న మేకుకు తగిలించాడు. 'చెప్పండి సాబ్ ఫోన్ చేస్తే సరకులు కుర్రాడితో పంపేవాణ్ణిగా, మీకెందుకు శ్రమ'- అంటూ చేతిలో వున్న సంచీ, కాగితం తీసుకున్నాడు.

క్యూరియాసిటీగా పలక వంక చూస్తున్న నన్ను చూసి, 'అదా! మా దగ్గర బాల కార్మికులు పనిచేయడం లేదని బోర్డు సాబ్! ఆఫీసర్ల కోసం' అన్నాడు నవ్వుతూ.

ఆ సూపర్ మార్కెట్టు కిషన్‌సేఠ్‌దే! ఆ షాపు మెయిన్ బజారుకు ఆనుకున్న పక్క సందులో వుంది. అక్కడ కూర్చుంటే మెయిన్ రోడ్డు మీద వచ్చే పోయే వాహనాల్ని, జనాల్ని స్పష్టంగా చూడొచ్చు. ఇక్కడ మెయిన్ రోడ్డంత సౌండ్ పొల్యూషన్ వుండదు. నా టైం పాస్‌కి మంచి చోటది. అక్కడ కూర్చుని వచ్చే పోయే జనాన్ని పరిశీలించడం నా హాబీ. 'నాకు తొందరేం లేదు. నీ పని చూసుకో సేఠ్' అంటూ అక్కడున్న దినపత్రికనందుకున్నాను.

ముందుగా అసలు పేపరు, తర్వాత సినిమా పేపరు, చివరిగా జిల్లా ఎడిషన్ చదువుతుండగా కిషన్ పేరు కన్పించింది. "సేఠ్ స్వీట్ తినిపించాలా నీ పేరు, నీ షాపు పేరు పేపర్లో వచ్చింది" అంటూ పేపరు చూపించాను. 'అదా బ్యాంకు వాళ్ళ పని సాబ్. ఈ షాపు మీద లోన్ తీశా కదా! పండగలకి పబ్బాలకీ బ్యాంకు పేర్న వాళ్ళు ఫోజులిచ్చి ఫోటోలు తీసుకోవడం

## నేను

ఆమె కోసం అప్పుడు
అందరికీ శత్రువునయ్యాను
ఇప్పుడు ఆమెకు కూడా...
వెలుగులు లేని భవిత
వెలవెలబోతూ
ఒంటరితనాన్ని
వెంట మిగిల్చింది
క్రొత్త జీవితం కోసం బ్రతుకు
పుస్తకాలతో దోస్తీ కట్టింది
ఇక నాకు దూరమైన నేను
నాకు నేనుగా
నేను నేనుగా
రూపుదిద్దుకుంటున్నాను.

-పాయల మురళీకృష్ణ

క్రింద శుభాకాంక్షలని మాబోటి వాళ్ళ పేర్లు రాసి.. ఆ ఖర్చులు మా ఖాతాల్లో జమచేయడం. సొమ్మొకడిది – సోకొకడిది"! అన్నాడు.

షాపుకి కస్టమర్లతో పాటు, అడుక్కునేవారి తాకిడి కూడా బాగానే వుంది. ప్రతి ఐదు, పది నిముషాల కొస్తున్నారు. సేఠ్ వచ్చిన వారందరికీ అర్థరూపాయో, రూపాయో ఇవ్వడం గమనిస్తూనే వున్నాను. ఈ రోజు శనివారం కదా! వాళ్ళు వస్తూనే వుంటారు – ఎంతో కొంత ఇస్తూనే వుండాలి. లేకపోతే షాపుకడ్డంగా గోడ కడతారు. కష్టమర్లకు ఇబ్బంది కదా సాబ్! అన్నాడు.

ఇంతలో దుబ్బులా పెరిగిన గడ్డాలు, తైల సంస్కారం లేని జుట్టు, నొసటన పెద్ద కుంకుమ బొట్టులతో వస్తాదుల్లాంటి అరడజను మంది – కష్టమర్లను తోసుకుంటూ జబర్దస్తీగా లోనికొచ్చారు. చేతిలో వున్న బుక్కుల్లోంచి రసీదు చించి సేఠ్ చేతికిచ్చాడొక బట్టతల దుబ్బు గడ్డం. మారు మాట్లాడకుండా ఐదువందల నోటిచ్చాడు సేఠ్. 'మా కాలనీ గణేష్ మండలివాళ్ళు – వినాయక విగ్రహం పెడతారంట' అన్నాడు కోపాన్ని దిగమింగుకుంటూ.

కొంచెం ఫాన్ వెయ్యి సెఠ్, ఉక్కపోతగా వుంది అన్నాను మొహం మీద వున్న చెమట బిందువుల్ని తుడుచుకుంటూ. 'ఒక్క పదినిముషాలు ఆగండి సాబ్, కరెంటు వస్తుంది. ఆ లైనుమేన్ గాడ్ని పిలుచుకుని రండ్రా. ఆ బద్మాష్‌గాడు పైసలు తీసుకుపోయి గంటయింది. అడిగిన వెంటనే పండగ మామూళ్ళివ్వలేదని. సర్వీసు వైరుని పోలు మీద నుంచి డిస్‌కనెక్ట్ చేసిన లైనుమేన్‌ని బండబూతులు తిడుతూ చెప్పాడు సేఠ్.

కరెంటోళ్ళా మజాకా! అనుకున్నాను. గతంలో వారు నాకిచ్చిన షాకులు గుర్తుచేసుకుంటూ. ఇంతలో 'నమస్తే సార్! ఇక్కడున్నారేంటి?' అంటూ పలకరించాడు లేబర్ ఆఫీసరు బాబూరావు. ఈరోజు సెల్వు కదా, ఇంట్లో ప్రొవిజన్స్ అయిపోతే ఇలా వచ్చా. మీకూడా హాలిడే కదా! ఇలా వచ్చారేం? అనడిగాను.

'లేబర్ హాలిడే కద్సార్'! షాప్స్ బంద్ చేయించాలంటూ సేఠ్ వంక చూస్తూ వెకిలిగా నవ్వాడు. అనుభవజ్ఞుడైన సేఠ్ లోనికి పిల్చి పని పూర్తిచేసి పంపాడు.' వస్తా సార్!! ఇంకా బంద్ చేయించాల్సిన షాప్స్ చాలా వున్నాయి అంటూ వెళ్ళిపోయాడు బాబూరావు.

కౌంటర్ మీద వున్న ఫోన్ మోగింది. కష్టమర్స్‌తో బిజీగా వున్న సేఠ్ ఫోన్ తీశాడు. ఆయన మాటల్లో, మొహంలో మార్పు స్పష్టంగా కన్పిస్తుంది. 'సాబ్ మా ఆడిటర్ నుంచి ఫోన్ ఇన్‌కంటాక్సు ఆఫీసరు అక్కడున్నాడంట. మీ సరకుల పిల్లగాళ్ళతో పంపుతా, మీరెళ్లండి' అని చెప్పి హడావిడిగా వెళ్ళిపోయాడు.

ఇంటికి తిరిగి వస్తుండగా శ్రీమతి మాటలు గుర్తొచ్చి స్వీటు షాపు ముందాగాను. ఆ షాపు నిండా జనం. పండగలకి, పబ్బాలకి ఇళ్ళల్లో స్వీట్లు చేసుకోవడం ఎప్పుడో మానేశారు. అంతా ఫాస్టు ఫుడ్స్ రెడీ మేడ్స్ కల్చరాయె! అందంగా అద్దాల్లో పేర్చి వున్న స్వీట్స్ వంక చూస్తూ నిల్చున్నాను. నన్ను గుర్తుపట్టిన షాపు యజమాని 'అజ్మీర్ కలాఖండ్ తిందురు లోనికి రండి సార్' అంటూ పిల్చాడు. మొహమాట పడుతూ లోనికెళ్ళాను. కుర్రాళ్ళ చేత స్వీటు బాక్సులు ప్యాక్ చేయిస్తున్నాడు. 'మంచి పండగ గిరాకీ తగిలినట్లుందే' అంటూ నవ్వుతూ ఆయన వంక చూశాను. 'ఇది చావు గిరాకీ సార్! మినిష్టరొస్తున్నాడంటూ హెల్త్ ఇన్‌స్పెక్టర్ హుకుం సార్! మా గొంతుల్లో కారం పడకుండా వుండాలంటే అడ్డమైన వాళ్ళ నోర్లు తీపిచెయ్యాలి సార్!' అన్నాడు. శ్రీమతి చెప్పిన స్వీట్స్ తీసుకుని బయట పడ్డాను.

ఇంటికి చేరే సరికి గేటు ముందు అరడజను మంది పాటలు పాడుతున్నారు. వారిలో ఇద్దరు లయబద్ధంగా డోలక్ వాయిస్తున్నారు. 'నమస్తే సార్! మొన్న హోలీకి ఊళ్ళో లేకుండా శ్రీశైలం పోయారు, ఈసారలా కుదర్దు. రెండు పండగలకి కలిపి 'ఈనాం' ఇవ్వాల్సిందే' – అంటూ ఇంకో పాట ఎత్తుకున్నారు. మారు మాట్లాడకుండా వారికి డబ్బులిచ్చి లోనికొచ్చాను.

'అంకుల్స్‌లా వుండి–ఆంటీల్లా చీర కుట్టుకుని పాటలు పాడుతూ మీ కోసం గంట నుంచి వెయిట్ చేస్తున్నారు. ఎవరు డాడీ వాళ్ళు?' అంటూ మా చిన్న బాబు అడిగాడు.

'పండగలప్పుడే ఈనాం కోసం వచ్చే సీజనల్ గెస్ట్‌లేరా' అన్నాను నవ్వుతూ. ■

## దృష్టి

ఎదురుగా వెన్నెల సంతకం
మంచుస్నానం! తెలుగు తోరణం
హే భగవాన్!
నాకొక్క క్షణం
కళ్ళు ప్రసాదించు!!

–జి. విజయశ్రీ